
# వరాహమూర్తి

శ్రీమతి. ఎ. జయలక్ష్మీరాజు

''నేనో కథ రాయాలనుకుంటున్నాను.'' అని అన్నాను మా వారితో.

''మీ పెదనాన్న కొడుకు మీదేనా? అనుకున్నా. వాడి కుళ్ళుజోకులూ వాడూ! వాడంటే నీకూ సరిపోవట్లేదని కనిపెట్టేశాను'' అన్నారు మావారు.

''కుళ్ళుమోతుమాటలూ మీరూ. వాడు ఆఫీసరయినాడని కుళ్ళు.'' అన్నాను కోపంగా.



''బోడి ఆఫీసరూ వాడూ. అయినా వాడి సంగతి మనకెందుకులేగానీ నువ్వెవరి మీద కథ రాస్తున్నావో చెబుదూ'' అన్నారు.

నేను సీరియస్‌గా మాట్లాడేసరికి రాజీ ధోరణిలోకి రావటం ఆయనకు అలవాటైపోయిందన్నట్టు అడిగారు.

''కథ ఎవరిమీదైతేంగానీ కథ పేరు మాత్రం మీపేరే!''

నా కోపం తగ్గలేదన్నట్టు విసురుగా, మాట్లాడి ఆయన్నిలా సందిగ్ధంలో ఉంచేశాను.

***

అనంతపురంలో నగర శివార్లలోనైతేనేమి... అయిదు సెంట్ల ప్లాటులో చిన్న ఇల్లు కట్టుకోవటం అంటే ఓ చిన్న గుమాస్తాగిరి జీవితంలో ఎంత గొప్పంటే తాజ్‌మహల్ కట్టినంత గొప్ప. అలాంటి తాజ్‌మహల్ కట్టుకున్నాము మేము.

''నీకేమప్పా! మీ మామ, బామర్దులు బాగ సాయంచేస్తారు. సొంత ఇల్లు కట్టుకున్నావు. నాకూ ఉండాడు ఎందుకు మా మామ. మా ఇంటికొచ్చి కోడి కోయించుకొని తిని పోతాడుగానీ, రెండు అరటి పండ్లు గూడ పట్టకరాడు'' అని మామగార్ల ఉసురుపోసుకుంటున్న కొలీగ్స్‌ను చూసి చాతీ ఉబ్బిపోయేది మావారికి!

రెండంటే రెండే గదుల ఇల్లు. చుట్టూ బండలు నాటిన కాంపౌండు ఓ మూల బోరు, మిగతా ఖాళీ స్థలమంతా పూల చెట్లు, కూరల పాదులు, ముందర చిన్న చెక్కగేటు.. పర్ణశాలను తలపించేదిగా, తయారుచేసుకున్న ఇంటిని చూసుకుని మురిసిపోయే వాళ్ళం. మా ఇంటి వెనుక, ఎదురుగా, పక్కన ఖాళీ ప్లాట్లు. దూరంగా విసిరేసినట్టు అక్కడో ఇల్లు, ఇక్కడో ఇల్లు. మొత్తం పది ఇళ్ళకు మించి లేవు. కాబట్టి అందరూ ఇట్టే పరిచయమైపోయి స్నేహితులయ్యారు. మగవాళ్లు ఆఫీసులకెళ్లగానే అందరూ గుమిగూడి కబుర్లు, కలిసి షాపింగ్స్, కలిసి మ్యాట్నీకెళ్లడాలతో ఎంతో సరదాగా రోజులు గడి

చిపోతుండగా ఓ అర్ధరాత్రి ఓ విచిత్రమైన శబ్దం.. మూలుగు.. అరుపు వినిపించింది. అందరం ఝడుసుకున్నాం.

''ఇదేదో దెయ్యాల నిలయంలా ఉంది. మీనాన్న మీద నాకు మొదట్నించీ అనుమానమే. చీప్‌లో కొనేసి మనమొహాన పడేశాడు. కూతురిమీద ప్రేమ ఒలకపోసినట్టు అందరూ అనుకోవాలని. నువ్వు చూస్తే దద్దమ్మవి. మంచి సెంటరులో కొనివ్వమని అడగొచ్చుగా. ఇచ్చిందే మహాప్రసాదమనుకుంటావు. పిల్లలు చూడు ఎలా వణుకుతున్నారో'' అంటూ అఘాయిత్యం మాటలు మాట్లాడసాగారు మావారు. అల్లుడంటే శాంతిపూజ లేని దశమగ్రహం అని పెద్దలు ఊరికే అనలేదని అనిపించింది.

నిజంగానే పిల్లలు భయపడుతున్నారేమోనని పిల్లలవేపు చూశాను. పిల్లలక్కడ లేరు.

''అమ్మా! నాన్న ఇలారండి!'' అంటూ బయట నించి అరిచారు పిల్లలిద్దరూ!

పరిగెత్తుకుని వెళ్లాం. పదేళ్ళ మా పెద్దాడు టార్చిలైటుతో పక్కనున్న ఖాళీ ప్లాటులో చూస్తున్నాడు స్టూలు వేసుకుని.

''ఏముందక్కడ?'' అంటూ మేమూ చూశాము. ఖాళీ ప్లాటులోనున్న ఓ పెద్ద కంపచెట్టు క్రిందికి పెద్ద పంది ఒకటి చెత్తా చెదారం నోట కరుచుకుని వచ్చి ఆ చెట్టు క్రింద పరుపులాగా తయారుచేస్తోంది. మధ్య మధ్యలో విచిత్రంగా మూలుగుతోంది. భయంకరంగా అరుస్తోంది కూడా. ఆ పంది కడుపుతో ఉందని ఈనటానికి పరుపు తయారుచేసుకుంటోందని నాకర్థమైంది.

**''కొంపన్నాక బల్లి, పిల్లి, రిళ్లీ ఎలా ఉంటాయో, వీధన్నాక పందులు, కుక్కలు ఉండకుండా ఉంటాయా.. దేవలోకం నించి ఊడిపడిన గంధర్వుల మాదిరి పోజులూ మీరూ పదండి కొంపలోకి! పంది కనబడేసరికి విచిత్రమైపోయింది!''**

''ఈ ఏరియాలో అసలు ఒక్క పందిలేకపాయె. ఇదెక్కడినించి వచ్చిందబ్బా! దరిద్రం! దరిద్రం! చీ!చీ!'' తండ్రీ కొడుకులు విసుక్కుంటూ ఛీత్కరించుకుంటున్నారు.

''కొంపన్నాక బల్లి, పిల్లి, రిళ్లీ ఎలా ఉంటాయో, వీధన్నాక పందులు, కుక్కలు ఉండకుండా ఉంటాయా.. దేవలోకం నించి ఊడిపడిన గంధర్వుల మాదిరిపోజూలూ మీరూ పదండి కొంపలోకి! పంది కనబడేసరికి విచిత్రమైపోయింది!'' అంటూ ఆరిచాను.

ఉదయం నాకన్నా ముందు లేచిన పిల్లలిద్దరూ ''అమ్మా! పంది పది పిల్లల్ని పెట్టిందే. ఎంత ముద్దుగా ఉన్నాయో!'' అన్నారు. నాకు నవ్వు వచ్చింది. వెళ్లి చూశాను.

''మీ తాతగారిచ్చిన జాగిర్దారులో మనకవే రాజహంసలు నాన్నా! అంత ముద్దొస్తుంటే ఆపుకోకు. వెళ్లి ముద్దులాడు.'' అన్నారు వాళ్ల నాన్న. దెప్పిపొడచటమే ధ్యేయమన్నట్టు.

''ఏమిటి మీ ఆయన నన్నాడిపోసుకుంటన్నాడన్నట్టు పంది గుర్రుగా చూసింది మావేపు.

***

ఆ పంది దాని పిల్లలు మమ్మల్ని ఇబ్బంది పెట్టకపోవటంతో వాటి గురించి కొద్ది నెలలు మర్చిపోయాము.

కొత్తగా వెలసిన కాలనీ కాబట్టి మురిక్కాలవలగురించి, రోడ్లు, వీధి లైట్ల గురించి మున్సిపాలిటీ పట్టించుకోలేదు.

''ఈ కాలనీ ఇంకా పంచాయితీయే' మున్సిపాలిటీకి చెందలేదని కొందరు, చెందిందని కొందరు అనుకోవటంలోనే అయిదేళ్లు గడిచిపోయాయి. ఈ అయిదేళ్లలో చాలామంది ఇళ్లు కట్టుకున్నారు. మురికి నీరు ఇళ్లముందుకు పారటంతో పోట్లాటలు కూడా మొదలయ్యాయి. పంది మరో రెండు మూడుసార్లు గర్భవతయింది. మొదటి ఈత పిల్లలు దినదిన ప్రవర్ధమానమై అవికూడా గర్భవతులై పట్టపురాణి పంది వంశం శాఖోపశాఖలుగా విస్తరించిన వృక్షంలాగా అయిపోయి, మురికి నీళ్లగుంటల్లో జలకాలాడుతు కనువిందు చేయసాగాయి.

ఈలోగా ఓ శుభ పరిణామం జరిగింది. ఒక స్త్రీ, ఓ యాభైమంది గుంపుతో చేతిలో పాంప్లెట్లతో మా




కాలనీ అంతా తిరుగుతూ, "అక్కా! నా పేరు బుచ్చి లక్ష్మి." అంటూ ఈవార్డు మున్సిపాలిటీకి చేరింది. "నేను వార్డుకు కౌన్సిలర్‌గా నిలబడుతున్నాను. నన్ను గెలిపించండి. నాగుర్తు పలానా.. నేను గెలిస్తే రోడ్లేయిస్తాను. లైట్లేయిస్తాను. కాలవలేయిస్తా..." అంటూ వాగ్దానాలు చేసింది.

"ఎంతైనా మనలాంటి ఆడది. గెలిస్తే మనకూ గర్వకారణం మన సమస్యలేమున్నా జంకు లేకుండా బుచ్చిలక్ష్మికి వినిపించుకోవచ్చు. నిలదీయొచ్చు కూడా! మన మగవాళ్లక్కూడా చెప్పి బుచ్చిలక్ష్మిని గెలిపిద్దాం!" అని కూడబలుక్కుని తీర్మానించాం. బుచ్చిలక్ష్మిని గెలిపించాం కూడా. అంతే. ఆ తర్వాత బుచ్చిలక్ష్మి కనిపించలేదు. ఆమె ఉన్న కాలనీలోకెళ్లి మా రోడ్ల పరిస్థితి కాలువల పరిస్థితేంటని అడిగాం ఆమెని.

"అంతా మా ఆయనే చూసుకుంటాడక్కా! నాకు పెద్దగా సదువు రాదుగదా! ఛైర్మన్‌తో మాట్లాడేది చేతకాదు కదా!" అంది.

బుచ్చిలక్ష్మి మొగుడినడిగితే "ఛైర్మన్‌నడిగినా మమ్మా! బడ్జెట్‌లేదంట. రేపు సంవత్సరం చూద్దామన్నాడు." అన్నాడు నిర్లక్ష్యంగా! బుచ్చిలక్ష్మి ఉంటున్నకాలనీలో మాత్రం అన్నివసతులు రోడ్లు కుళాయిలు, లైట్లు, కాలువలు, సమకూర్చుకున్నారు. ఇదేం పక్షపాతం అని అడిగేవారులేరు. ఒక వేళ అడిగినా ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవటం. మమ్మల్నో విప్లవకారుల్ని చూసినట్టు చూడటం. గుర్తుకొచ్చినపుడంతా కౌన్సిలర్‌ను దుమ్మెత్తిపోసినట్టు తిట్టుకోవటం తప్ప చేయగలిగిందేమీలేదు. మళ్లీ ఎలక్షన్లొచ్చాయి. ఇంకో కౌన్సిలర్ సీట్లో కూర్చుంది. గుడ్డికంటే మెల్లమేలన్నట్టు మట్టి రోడ్లు వేయించి, వీధిలైట్లు, కొళాయిలు బాగానేవేశారు. కానీ మురిక్కాలువలు మాత్రం సరిగా కట్టక సరైన దిశలో మురికి నీరు ప్రవహించకపోవటంతో పందులకవి, స్విమ్మింగ్‌పూల్స్ అయ్యాయి. ఇళ్లల్లోకి మురికి కంపు, విపరీతంగా దోమలు, భరించలేకపోతున్నాం. ఈ మురిక్కాలవలు సరైన దిశలో వెళ్లేటట్టు కట్టి ఈ పందుల్ని పారద్రోలించండని కౌన్సిలర్‌తో మొరపెట్టుకున్నాం. లాభం లేకపోయింది.

"ఇలా కాదు నువ్వో అర్జీ రాయక్కా! అందరం ఛైర్మన్‌గారి దగ్గరికిపోయి ఈ మురిక్కాలవలు, పందుల సమస్య చెప్పుదాం." అంటూ మా కాలనీ వాళ్లంతా అన్నారు.


"ఛైర్మన్‌గారికి నమస్కారములు.

మా ఈ కాలనీ ఏర్పడి పదిహేను సంవత్సరాలయింది. రెండుసార్లు ఎలక్షన్లు జరిగి ఇద్దరు కౌన్సిలర్లు పరిపాలించారు కానీ మా సమస్యలు పూర్తిగా తీర్చలేకున్నారు. మా సమస్య మురిక్కాలవలు, పందులు. కాలువలు సరిగా కట్టలేదు. సరిగా ప్రవహించక దుర్గంధంగా ఉంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలెక్కువయ్యాయి. పెద్దవాళ్లకు మలేరియా జ్వరాలొస్తున్నాయి

పిల్లలకు మెదడు వాపు వ్యాధులొస్తున్నాయి సార్.

మా ఇళ్లల్లో మాటలు రాని పసిపిల్లలకు 'అదిగో కుక్క, అదిగో మేక, అదిగో ఆవు, అదిగో కోడి' అని చూపించాల్సింది పోయి 'అదిగో పంది' అని చూపించాల్సి వస్తోంది. పందులు తప్ప మా కాలనీలో ఇంకే జంతువులూ లేవు. ఇంటిముందు ఊరకుక్కకు కాస్త అన్నం వేస్తే అవసరమైనపుడు మొరుగుతుంది కదాని అన్నం వెయ్యబోతే పదిపందులొచ్చి కుక్కను తరిమేసి తింటున్నాయి. కుక్కలు మా కాలనీ వదలి వలస వెళ్లిపోయాయి.

ఇంటి ముందుకొచ్చిన ఆవుకు కాస్త జొన్నలో, పండో, ఫలమో పెట్టి గోవు మా లక్ష్మి తల్లి' అని నమస్కారం చేసుకుందామనుకుంటే హెలికాప్టర్ నించి విసిరేసిన ఆహార పొట్లాల కోసం ఎగబడే వరద బాధితుల్లాగా, పందులు పరిగెత్తుకుని వచ్చి ఆవును తరిమేసి తినేస్తుంటే.. పాపం ఆవు జాలిగా మా వేపు చూసి వెళ్లిపోతోంది. మొన్నోసారి మా వీధిలో నడక వచ్చిన ఓ పసిపిల్లవాడు పందిపిల్లను ముద్దుపెట్టుకున్నాడు. పందులు మేము కలిసి సహజీవనం చేస్తున్నామంటే అతిశయోక్తిలేదు. కళ్లు తెరిస్తే పందులు. కళ్లు మూస్తే పందుల అరుపులు.. చెబితే నమ్మరేమో మొన్నామధ్య తీర్థయాత్రలకని తమిళనాడు, కేరళ వెళ్లాం. విచిత్రంగా నా కళ్లు పందులకోసం వెతికాయి. ఉన్న వారంరోజుల్లో ఆ రాష్ట్రాల్లో అందులోనూ వీధుల్లో మచ్చుకి ఒక్క పంది కనబడ



లేదంటే నమ్మండి. ఈ పందుల నరకం నించి మమ్మల్ని తప్పించండి సార్!" అంటూ వ్రాసిన అర్జీ ఛైర్మన్ గారికిచ్చి ఓ ముప్పయి మంది స్త్రీలమంతా మూకుమ్మడిగా వాగోడు వెళ్లబోసుకున్నాము. పాపం! ఛైర్మన్ మంచాయనలాగున్నాడు.

"అరె రె! అలాగామ్మా! నాకు తెలియదే. మీ సమస్య తప్పక పరిశీలించి పరిష్కరిస్తాను.

పాపం! ఆడవాళ్లు ఇళ్లల్లో మీకెన్ని పనులుంటాయి. అవన్నీ వదులుకుని ఇంతదూరం ఎందుకొస్తారు? నా సెల్ నెంబరిస్తాను ఫోన్ చెయ్యండి. నెలరోజుల్లో పందులను పారద్రోలి.. కాలువలు కట్టిస్తాము. మీ కాలనీ శుభ్రం చేయిస్తాను" అంటూ హామీ ఇచ్చాడు. అల్ప సంతోషులం కదా! ఆ మాత్రానికే పొంగిపోయి ఇళ్లకొచ్చాం.

నెల, రెండు, మూడు, ఆరు నెలలు గడిచాయి. సెల్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని పలుకుతుంది. మళ్లీ ఛైర్మన్ దగ్గరికెళ్లాలంటే విసుగు, నిర్లిప్తత!

అనంతపురం, కార్పొరేషన్ అయిందంటూ వార్తలొచ్చాయి. మళ్లీ మాలో ఆశ చిగురించింది. ఎలక్షన్లొచ్చాయి. మావార్డుకు పోటీచేసి కార్పొరేటర్లు ప్రచారానికొచ్చి "మేం గెలిస్తే పందులను రూపుమాపుతాం" అంటూ వెరైటీగా వాగ్దానాలు చేశారు. ఎందుకంటే వాళ్ల ప్రచార వాహనాలకు పందులు అడ్డంపడి తిరగటంతో అందరూ మైకుల్లో పందుల గురించే వాగ్దానాలు చేశారు. అనంతపురానికి పందులు తప్ప మరే సమస్య లేనట్టుంది!

'ఎలక్షన్లయిపోయి మూన్నెల్లు జరగలేదు. సీట్లో సరిగ కూర్చోనే లేదు. అసలు మీకు దైవభక్తి లేదయ్యా. ఏ జీవిలోనైనా దేవుడిని చూడాలయ్యా! అసలు పందంటే ఎవరు? దశావతారాల్లో ఒకటి. వరాహమూర్తి. పందులను అసహ్యించుకోకుండా ఆ పంది ఏ అంశనించి వచ్చిందని ఆలోచించండి! పందులు మీకిక సమస్య అనిపించదు."

"వీళ్లిలాగే మాట్లాడుతారు. గెలవగానే ఎవరికెవరో. అసలు మనం ఓటేవెయ్యొద్దు" అన్నాను కోపంగా.

"ఓటెయ్యం పొమ్మని బెదిరిచ్చేదికూడా లేదక్కా! మన ఓట్లు సగం మందివి గల్లంతయి మన వార్డు నించి వేరే వార్డుల్లోకి పోయినాయంట" అన్నారు మావాళ్లు. కిసుక్కున నవ్వుతూ!

"ఇన్నాళ్లుగా ఇక్కడున్నాం స్వంత కొంపల్లో! ఓట్లు లేకపోవడమేమిటి. గల్లంతు కావడమేమిటి? వెళ్లి అడిగితే –

"ఇప్పుడెవర్ని అడిగేది. వారం దినాల్లో ఓట్లు. ఇసిత్రంగా మన మొగోల్ల ఓట్లు ఈ వార్డులో ఉండాయి. ఆడోల్ల ఓట్లు ఎగిరిపోయినాయి."

"సీటికి మాటికీ కాలువలు పందులని అర్జీలు తీసుకుని ఆఫీసుపోతున్నామని కచ్చపెట్టుకొని మన పేర్లు లేపేసింటారు!" వీధిలో ఆడవాళ్లు తలోమాట అనుకుంటున్నారు.

ఎలాగైతేనేం... "అయ్యవారు లేకుంటే అమవాస్య ఆగుతుందా!" అన్నట్లు మేం ఓటెయ్యకపోయినా ఎలక్షన్లు ఆగలేదు.

మావార్డుకు పందులను రూపుమాపుతానని పదే పదే వాగ్దానం చేసిన కార్పొరేటరు గెలిచాడు. పదవీ స్వీకార ప్రమాణం చేశాడు.

మూడునెలలు గడిచాయి. గెలిచిన కార్పొరేటరు పత్తాలేడు.

మా కాలనీ ఆడవాళ్లు కార్పొరేటరు దగ్గరికెళ్లి పందుల బెడద గురించి సీరియస్‌గా అడుగుదాం రమ్మన్నారు.

"ఎప్పుడూ ఆడవాళ్లమే ఎందుకు? మగవాళ్లకు మాత్రం బాధ్యత లేదా? మగవాళ్లకు కోపమెక్కువ కదా! కాస్త సీరియస్‌గా అడగ్గలరు. పనవుతుందేమో చూద్దాం." అన్నాను.

కాలనీలో మగవాళ్లనందర్ని చేర్చి వాళ్లకు వెన్ను తట్టి వీర తిలకం దిద్ది కత్తి బల్లెం లాంటి అర్జీలిచ్చి కార్పొరేటరు దగ్గరికి యుద్ధానికి పంపించేసరికి నీరసమొచ్చింది. గంటటైం కూడా గడవకముందే తిరిగొచ్చేశారంతా!

"ఏమన్నాడు? బడ్జెట్ లేదన్నాడా? రేపు నెల చూద్దామన్నాడా? లాండ్ లైన్ ఫోన్ నెంబరిచ్చాడా?" ఎగతాళి ధ్వనిస్తూ అడిగాను.

"ఏమన్నాడో మీ ఆయనన్నడగవమ్మా! ఆదివారం పూట మూడంతా పాడు! టైమంతా వేస్టు" అంటూ అందరూ వెళ్లిపోయారు.

"ఏమన్నాడండీ! గొడవకాని జరిగిందా?" కంగారుగా అడిగాను.

"గొడవా? ఇంకా నయం! అలాంటిదేం లేదు. పాపం! మన వార్డు కార్పొరేటరుకు దైవభక్తి చాలా ఎక్కువ."

"సీరియస్‌గా మాట్లాడేటపుడు టాపిక్ మళ్లించద్దని లక్షసార్లు చెప్పాను మీకు" కోపంగా అన్నాను.

"అందుకే కథ మళ్లించకుండా వల్లిస్తున్నాను. విను!

'ఏందయ్యా మీ ఆడోళ్లు, మీరు పొద్దు గూకులు పందులు పందులని ఇట్ల సతాయిస్తున్నారు. ఎలక్షన్లయిపోయి మూన్నెల్లు జరగలేదు. సీట్లో సరిగ కూర్చోనే లేదు. అసలు మీకు దైవభక్తి లేదయ్యా. ఏ జీవిలోనైనా దేవుడిని చూడాలయ్యా! అసలు పందంటే ఎవరు? దశావతారాల్లో ఒకటి. వరాహమూర్తి. పందులను అసహ్యించుకోకుండా ఆ పంది ఏ అంశనించి వచ్చిందని ఆలోచించండి! పందులు మీకిక సమస్య అనిపించదు" అంటూ ఇంకా ఆ అవతారం గురించి చెబుతూనే ఉన్నాడు. లాభం లేదని జారుకున్నామంతా! కార్పొరేటరుగారు భక్తి పారవశ్యంతో ఇప్పటికీ తేరుకుని ఉండడు.

"అవునూ! ఇంతకీ వరాహమూర్తంటే ఖచ్చితంగా పందేనంటావా? ఎప్పటికైనా నా జీవితం ఈ పందుల మధ్య వెళ్లమారిపోతుందని మా అమ్మ పిచ్చి తల్లి కలగనుంటుంది. అందుకే నాకు వరాహమూర్తి అని పేరు పెట్టింది!" అని అంటున్న మా వారిని చూసి నవ్వాపుకోలేకపోయాను.

★


**ఆధునిక దంత వైద్యం**




ప్రొ॥ డా॥ పి.వి.పార్థసారథి  డా॥ కె.ఎం.సుమలత
కాస్మటిక్ డెంటల్ స్పెషలిస్ట్స్



ఎత్తుపళ్ళు, వికారంగా కనిపించే చిగుళ్లతో ఎంతో నరకం అనుభవించా!! నవ్వడమే మానేశా! నలుగురితో కలవడానికి ఎంతో సిగ్గుగా ఉండేది!



డాక్టర్ని కలిసి కాస్మటిక్ చికిత్స చేయించుకొన్నా. రెండు సిట్టింగుల్లో నా ముఖాన్ని ఎంతో అందంగా మార్చేశారు!! నేనే నమ్మలా!! ఒకేసారి నా కష్టాలన్నీ తీరిపోయినట్లనిపించింది!!

**పార్థ దంత వైద్యశాల & రీసర్చి సెంటర్**
ఆర్టీసి బస్టాండ్ దగ్గర, పెద్దకాపు లే ఔట్, తిరుపతి.
ఫోన్:0877-2250555, 2250105

**త్వరలో...**
మొదటి అంతస్తు, స్కిల్ స్పెక్ట్రమ్ కాంప్లెక్స్
టిటిడి కళ్యాణ మండపం ప్రక్కన, లిబర్టీ సెంటర్
హిమాయత్‌నగర్, హైదరాబాద్
ఫోన్:55991010, సెల్:9346442644

మరిన్ని వివరాలకు/మీ సందేహాలకు
www.partha.org ని చూడండి